# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 31-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- భారత మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ సమైక్యతా దినోత్సవం జరుపుకున్నారు.

- నిర్దేశించుకున్న సమయానికి అమరావతిలో నిర్మాణాలు పూర్తి కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.

- తుఫాను భాదితులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హోం మంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు.

- గ్రామీణ, గిరిజన ప్రాంతాల మహిళలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

- తూర్పు నావికాదళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.

====================

రాజధాని నిర్మాణ పనులు జాప్యం లేకుండా జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతి, బ్యూటిఫికేషన్, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్షించారు. నిర్దేశించుకున్న సమయానికి నిర్మాణాలు పూర్తి కావాలని స్పష్టం చేశారు. నిర్మా ణాల్లో వేగంతో పాటు.. నాణ్యత ప్రమాణాలను పక్కాగా పాటించాలని ఆదేశించారు. పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకొకసారి సమీక్షిస్తానని చెప్పారు. ప్రస్తుతం వర్షాల కారణంగా నిర్మాణ పనుల్లో కొంత మేర జాప్యం జరిగినప్పటికీ.. రానున్న రోజుల్లో దాన్ని భర్తీ చేసేలా నిర్మాణాల్లో వేగం పెంచాలని చంద్రబాబు నాయుడు సూచించారు.

====================

ప్రైవేటు ఆస్పత్రుల అసోసియేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులతో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈరోజు సమావేశమయ్యారు. నవంబర్ చివరికల్లా పెండింగ్ బకాయిలు మొత్తం ఒకే విడతలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. బకాయిల చెల్లింపుపై మంత్రి స్పష్టమైన హామీ ఇవ్వడంతో వైద్యసేవల పునరుద్ధరణకు ఆసుపత్రి యాజమాన్యాలు అంగీకరించాయి.

====================

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో హోం, విపత్తుల నిర్వహణ శాఖా మంత్రి వంగలపూడి అనిత ఈరోజు పర్యటించారు. పాయకరావుపేట నియోజకవర్గం బంగారమ్మపాలెం గ్రామంలో పర్యటించిన మంత్రి తుఫాను బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన నిత్యవసర వస్తువులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా  మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ తుఫాన్ బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా  ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయడంతో పాటు, ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్దంచేయడం వలన ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించగలిగామని హోంమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...23 సెకన్లు)

====================

భారత మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ సమైక్యతా దినోత్సవం జరుపుకున్నారు. దీనిలో భాగంగా గుంటూరులో నిర్వహించిన ఏక్తా రన్ లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విభిన్న కుల, మతాలకు కేంద్రమైన భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం సాధించడానికి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్ధినీ విద్యార్థులు, పోలీస్ అధికారులతో జాతీయ సమైక్యత పరుగు సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. విశాఖపట్నం రేంజ్ పోలీసు కార్యాలయంలో “జాతీయ సమైక్యతా దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. డీఐజీ గోపినాథ్ జట్టి, వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్యానంతరం దేశంలోని అనేక రాచరిక రాష్ట్రాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పోషించిన అత్యంత కీలక పాత్ర దేశ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఏకతా దివస్ సందర్భంగా రాజమహేంద్రవరం యూనిటీ రన్ ను తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నర్సింహ కిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. దేశానికి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేసిన సేవలు అమోఘమని, స్ఫూర్తిదాయకమని ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. అనంతపురంలో యూనీటి మార్చ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ నేటి యువత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని, కాకినాడ జిల్లా పోలీసు అధికారి బిందు మాధవ్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు సిబ్బంది “యూనిటీ రన్” కార్యక్రమం నిర్వహించారు.

====================

విరామం

====================

విశాఖపట్నంలోని తూర్పు నావికాదళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తూర్పు నావికాదళం ఛీఫ్ గా వ్యవహరించిన వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ పదవీకాలం నేటితో ముగిసింది. ఈ నేపథ్యంలో రాజేష్ పెంధార్కర్ విరమణ, సంజయ్ భల్లా పదవీ బాధ్యత స్వీకారం కోసం తూర్పు నావికాదళంలో సెరిమోనియల్ పరేడ్ ను ఘనంగా నిర్వహించారు. ఈ పెరేడ్ లో ENC ఛీఫ్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత... వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా సెరిమోనియల్ గార్డ్‌ను తనిఖీ చేశారు.

====================

మొంథా తుఫాన్‌తో రైతులు నష్టపోకుండా రాష్ట్రంలో నీట మునిగిన పంట పొలాలను యుద్ధప్రాతిపదికన కాపాడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుఫాన్ తదనంతర చర్యలపై గుంటూరు జిల్లా ఉండవల్లిలో ముఖ్యమంత్రి ఈరోజు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఎక్కడెక్కడ పొలాలు నీట మునిగాయో గుర్తించి నీటిని మళ్లించాలని చంద్రబాబు సూచించారు. శాస్త్రవేత్తల సూచనలు తీసుకుని... పంటలు నీట మునగడం వల్ల దిగుబడి తగ్గకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. తుఫాన్‌తో రాష్ట్రానికి జరిగిన నష్టంపై కేంద్రానికి వెను వెంటనే ప్రాథమిక నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

====================

మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం మరియు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. ఈరోజు సాలూరు పట్టణంలో నిర్వహించిన "సఖి సురక్ష హెల్త్ స్క్రీనింగ్" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండాలంటే మహిళల ఆరోగ్యం అత్యంత కీలకమని అన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల మహిళలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సమాజంలో మహిళల భాగస్వామ్యం పెరగాలంటే, ఆర్థిక సుస్థిరత మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు.

====================

విశాఖపట్టణం వేదికగా నవంబర్ 14, 15వ తేదీల్లో జరిగే ప్రపంచ స్థాయి భాగస్వామ్య సదస్సుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సన్నాహక సమన్వయ కమిటీ సమావేశం ఈరోజు జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన ఈ కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి అంబాసిడర్లు, కాన్సులేటర్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సదస్సు జరుగుతుందని కలెక్టర్ పేర్కొంటూ...

(వాయిస్ బైట్...25 సెకన్లు)

====================

ఉత్తర ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాలలో బాగా గుర్తించబడిన అల్పపీడన ప్రాంతం ఉత్తర-ఈశాన్య దిశగా కదులుతూ రానున్న 12 గంటల్లో అల్పపీడన ప్రాంతంగా బలహీనపడే అవకాశం ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి బి. శేఖర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని చెప్పారు. వీటి ఫలితంగా రాష్ట్రంలో రానున్న మూడు రోజుల వరకు వాతావరణ వివరాలను ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ బైట్...20 సెకన్లు)

====================

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయనకు నివాళులర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో ముఖ్యమంత్రి పోస్ట్ చేశారు. ఉక్కు సంకల్పంతో దేశాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి, జాతీయ ఐక్యతకు పునాది వేసిన సుస్థిర జాతి శిల్పి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అని తెలిపారు.

====================

====================